క్లుప్తంగా

డాక్టర్ సాంబశివరావుకు యూత్ ఐకాన్ అవార్డు



అవార్డుతో సాంబశివరావు

అమలాపురం టౌన్: అమలాపురం ఎస్ఎస్ఆర్ ఎల్‌టీఎల్ ట్రెనింగ్స్ ప్రైవేట్ లిమిటెడ్ సీఈవో సీహెచ్ సాంబశివరావు ఇంటర్నేషనల్ యూత్ ఐకాన్ అవార్డు అందుకున్నారు. న్యూఢిల్లీలో ప్రధాన మంత్రి సంగ్రహాలయంలో ఈ నెల 20న వరల్డ్ కల్చరల్ అండ్ ఎన్విరాన్‌మెంట్ ప్రొటెక్షన్ కమిషన్ నిర్వహించిన ఈ అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో ఆయన ఐకాన్ అవార్డును ఆన్‌లైన్ ద్వారా అందుకున్నారు. సాంబశివరావు రూపకల్పన చేసిన పంచ ప్రక్రియ సాధన (మానసిక, భౌతిక, ఆరోగ్య కార్యక్రమం), మాతృ మాత, మాతృ భూమి, మాతృ భాష కార్యక్రమాల ద్వారా భారతీయ సంస్కృతిని, విద్యార్థులు ముఖ్యంగా, యువకులను ప్రభావితం చేశాయని ఆ సంస్థ పేర్కొంది.

వచ్చే నెల 14న లోక్ అదాలత్

అమలాపురం టౌన్: మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో వచ్చే నెల 14వ తేదీన లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు కమిటీ చైర్మన్, జిల్లా రెండో అదనపు కోర్టు న్యాయమూర్తి వి.నరేష్ తెలిపారు. ఈ అదాలత్ ద్వారా వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న సివిల్, చెక్ బౌన్స్ కేసులు, రాజీ పడ తగ్గ క్రిమినల్ కేసులు పరిష్కరిస్తారన్నారు. అమలాపురం కోర్టుల్లో ఆ రోజు ఉదయం 10.30కు ప్రారంభమయ్యే లోక్ అదాలత్‌కు కక్షిదారులు హాజరై, తమ కేసులను పరిష్కరించుకోవాలని సూచించారు. న్యాయవాదులు, పోలీసు, బ్యాంక్, రెవెన్యూ అధికారులు కక్షిదారులకు సహకరించి, ఎక్కువ కేసులు పరిష్కారమయ్యేలా కృషి చేయాలని కోరారు.

వీధి వ్యాపారులకు అవగాహన

అమలాపురం టౌన్: పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఆధ్వర్యంలో స్థానిక మొబర్లీపేట ఇండియన్ బ్యాంక్ బ్రాంచిలో వీధి వ్యాపారులకు స్వనిధి బీ, స్వాభిమాన్ బీ పఖ్వాడ పథకాలకు సంబంధించి డిజిటల్ యాక్టివేషన్ కార్యక్రమం గురువారం జరిగింది. బ్యాంక్ అధికారులు పట్టణంలోని వీధి వ్యాపారులు, డ్వాక్రా మహిళలకు డిజిటల్ యాక్టివేషన్‌పై అవగాహన కల్పించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు మాట్లాడుతూ, పట్టణంలోని వీధి వ్యాపారులు, డ్వాక్రా మహిళలు స్వనిధి రుణాలను సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇండియన్ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ సుప్రియ, ఐసీడీఎస్ టీచర్ వెంకటలక్ష్మి, మెప్మా ఉద్యోగి శ్రీనివాస్, మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు, డిజిటల్ అగ్రికేటర్లు పాల్గొన్నారు.

26న మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

తాళ్లరేవు: మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం ఈ నెల 26వ తేదీన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలోని సమావేశపు హాలులో ఎంపీపీ రాయుడు సునీత అధ్యక్షతన ఈ సమావేశం జరుగుతుందన్నారు. ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, అన్ని శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని ఎంపీడీఓ కోరారు.

సాఫ్ట్‌బాల్ స్టేట్ మీట్‌కు గొల్లవిల్లి విద్యార్థులు



ఎంపికైన విద్యార్థులతో హెచ్ఎం రాణి

ఉప్పలగుప్తం: ఎస్‌జీఎఫ్ అండర్-14 సాఫ్ట్‌బాల్ స్టేట్ మీట్‌కు మండలంలోని గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పండు దివ్య లేఖన, మల్లిపూడి అయ్యప్ప ఎంపికయ్యారు. చిత్తూరు జిల్లా అరగొండలో జరిగే పోటీల్లో వీరు పాల్గొంటారని హెచ్ఎం లంకా రాణి గురువారం తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను పీఎంసీ చైర్మన్ వాలా సత్యనారాయణ, పీడీలు గొలకోటి ఫణీంద్ర, డి.సరస్వతి, పీఈటీ వి.విజయభాస్కర్ అభినందించారు.

చెల్లి అశోక్‌కు సత్కారం

ముమ్మిడివరం: మాల కార్పొరేషన్ మెంబర్‌గా నియమితులైన చెల్లి అశోక్‌ను గురువారం పలువురు సత్కరించారు. మున్సిపల్ కమిషనర్ పి.రవివర్మ మున్సిపల్ సిబ్బంది ఆయన స్వగృహం పల్లిపాలెంలో కలిసి దుశ్శాలువాతో సత్కరించి, అభినందనలు తెలిపారు. అలాగే కాకినాడ స్మార్ట్ సిటీ సీడీఓ గెద్దం సాల్మన్ చక్రవర్తి ఆయనను శాలువాతో సత్కరించారు.

స్కూళ్లలో పోక్సో కమిటీలు

యానాం: పుదుచ్చేరి, మాహే, కారైకల్, యానాం నాలుగు రీజియన్లలో అన్ని స్కూళ్లలో లైంగిక నేరాలకు వ్యతిరేకంగా పోక్సో కమిటీలను వేయాలని గురువారం డైరెక్టరేట్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆదేశాలు జారీ చేసింది. అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లలో విద్యనభ్యసించే విద్యార్థులకు పోక్సో కమిటీల ద్వారా భద్రత కలుగుతుందని పేర్కొంది. స్కూల్ హెచ్ఎం ఆధ్వర్యంలో కమిటీ చైర్‌పర్సన్‌ను, వైస్ చైర్మన్‌ను నియమించాలని నిర్దేశించింది. సీనియర్ మహిళా టీచర్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఎన్‌జీఓ సభ్యుడిని నియమించాలని ఆదేశించింది. జిల్లా, రాష్ట్ర, స్కూల్ స్థాయి కమిటీలు ఏర్పాటు చేయాలని స్పష్టం చేసింది.

వలకట్టు.. కనికట్టు



కొమరగిరిపట్నం వద్ద పంచనీటి కాలువలో ఏర్పాటు చేసిన వలకట్టు



దేవగుప్తంలో వరి చేలలో ఇంజిన్‌తో బయటకు తోడుతున్న ముంపు నీరు

- ముంపునీటి ప్రవాహానికి ప్రతిబంధకం
- రైతుల పాలిట శాపం
- కోతల సమయంలో అన్నదాతల ఆందోళన
- పట్టించుకోని డ్రెయిన్స్ అధికారులు

అల్లవరం: ప్రకృతి వైపరీత్యాల కారణంగా భారీ వర్షాలు కురిసినప్పుడు.. ముంపు నీరు స్తంభించి పండిన పంట ముంపునకు గురైతే ఆ రైతు కష్టం నీటి పాలైపోతుంది. రైతు కష్టం నీటిపాలు కాకుండా ఉండాలంటే డ్రైయినేజీ వ్యవస్థ ప్రక్షాళన చేయాల్సి ఉంది. ప్రతి ఏటా ఖరీఫ్ పంట రైతులకు నష్టాలనే మిగుల్చుతోంది. తుపాన్లు, అధిక వర్షాలతో ముంపు నీరు స్తంభించి చేదు అనుభవాలే దిక్కవుతున్నాయి. ముంపు నీరు స్తంభించడానికి ప్రధాన కారణం వలకట్లు. మత్స్యకారులు చేపల కోసం డ్రెయినేజీల్లో ఏర్పాటు చేసే వలకట్లు నీటి ప్రవాహాన్ని అడ్డుకుని ముంపునీరు దిగువకు వెళ్లకుండా అడ్డుకుంటున్నాయి.

ఎక్కడ పడితే అక్కడ..

అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లో ప్రధాన డ్రెయిన్ల ద్వారా ముంపు నీరు సముద్రానికి చేరాల్సి ఉంది. అయితే ముంపు నీరు వెళ్లే ప్రధాన డ్రెయిన్‌లో వెదురు కర్రలు, బరకాల సాయంతో ఏర్పాటు చేస్తున్న వలకట్లు రైతులు పాలిట శాపంగా మారుతున్నాయి. అల్లవరం మండలం వాసాలతిప్ప డ్రెయిన్‌పై మూడు, లోయర్ కౌశిక డ్రెయిన్‌పై మూడు, పంచనీటి కాలువపై రెండు వలకట్లుని ఏర్పాటుచేశారు. ఉప్పలగుప్తం మండలం కూనవరం డ్రెయిన్‌పై మూడు, రంగరాజుకోడు డ్రెయిన్‌పై ఒకటి, పాత అయినాపురం డ్రెయిన్‌పై మూడు, గొరగనమూడి డ్రెయిన్‌పై రెండు వలకట్లని అక్రమంగా ఏర్పాటు చేసి నీటి ప్రవాహాన్ని అడ్డుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా వలకట్లు ఏర్పాటు చేసినా, అధికారులు మాత్రం తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. వాటిని ఏర్పాటు చేసిన వారు మాత్రం నిబంధనలు తమకు వర్తించవన్నట్టుగా వ్యవహరిస్తూ, వలకట్లు యథేచ్ఛగా ఏర్పాటు చేసుకుని రైతాంగాన్ని కుంగదీస్తున్నారు.

నిండుకుండలా డ్రెయిన్!

అమలాపురం, అల్లవరం, ఉప్పలగుప్తం, అయినవిల్లి మండలాల్లోని సుమారు 30 వేల ఎకరాల వ్యవసాయ క్షేత్రాల నుంచి వస్తున్న ముంపునీరు ప్రధాన డ్రెయిన్ల ద్వారా సముద్రానికి వెళ్లాల్సి ఉంది. అల్లవరం, అమలాపురం మండలాల్లోని పలు గ్రామాల్లో వరి కోతలు ప్రారంభమయ్యాయి. ఈ సమయంలో వరి పొలాల్లో ముంపునీరు దిగువకు వెళ్తేనే.. వరి కోతలు సజావుగా సాగి పంట చేతికి అందుతుంది. అయితే ప్రధాన డ్రెయిన్‌లో వలకట్లు ఉండడంతో ముంపు నీరు స్తంభించి, డ్రెయిన్లు నిండుకుండలా దర్శనమిస్తున్నాయి. డ్రెయిన్‌లో నీరు దిగువకు వెళ్లి వలకట్లు తొలగించాల్సి ఉంది. ఆ దిశగా రెవెన్యూ, డ్రెయిన్స్ అధికారులు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు.

> **పోలీసులకు ఫిర్యాదు**
>
> ముంపు నీటికి అడ్డంగా డ్రెయిన్‌లో ఏర్పాటు చేసిన వలకట్లు తొలగించాలని జాయింట్ కలెక్టర్ ఆదేశాలతో ఇప్పటికే పోలీసులకు ఫిర్యాదు చేశాం. వలకట్లని సంబంధిత వ్యక్తులు తొలగించకపోతే పోలీసుల సహకారంతో వాటిని తొలగించి, ముంపునీరు దిగువకు వెళ్లేలా చర్యలు తీసుకుంటాం.
>
> – సునితాదేవి, డ్రెయిన్స్ ఏఈ, అమలాపురం

ముగిసిన మెప్మా బజార్ ప్రదర్శన

రెండో రోజూ అదే స్పందన



అమలాపురంలో మెప్మా బజార్‌లో విరివిగా జరుగుతున్న విక్రయాలు

అమలాపురం టౌన్: పట్టణంలోని గడియారం స్తంభం సెంటరులో పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ (మెప్మా) ఏర్పాటు చేసిన మెప్మా బజార్‌కు రెండో రోజైన గురువారం కూడా వినియోగదారుల నుంచి అదే స్పందన కనిపించింది. పట్టణానికి చెందిన స్వయం సహాయక సంఘాలకు చెందిన మహిళలు స్వయం ఉపాధి కోసం తయారు చేసిన పలు వస్తువుల విక్రయానికి ఈ మెప్మా బజార్ ప్రదర్శన ఏర్పాటు చేయడంతో వినియోగదారులు వాటిని విరివిగా కొన్నారు. రెండో రోజు దాదాపు రూ.లక్ష మేర టోర్నవర్ జరిగిందని మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజు తెలిపారు. రెండు రోజుల కోసం ఏర్పాటు చేసిన ఈ మెప్మా బజార్ గురువారం సాయంత్రంతో ముగిసింది. బజార్ అమ్మకాలను పట్టణ మెప్మా కమ్యూనిటీ ఆర్గనైజర్లు, రిసోర్స్‌పర్సన్లు పర్యవేక్షించారు.

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం

కోరంగిలో ఘనంగా ప్రపంచ మత్స్యకార దినోత్సవం



సీతారామపురంలో జరిగిన సభలో మాట్లాడుతున్న ఈశ్వరరావు

తాళ్లరేవు: మత్స్యకారుల ఐక్యతతోనే సమస్యలు పరిష్కారం అవుతాయని, మత్స్యకారులందరూ ఐక్యంగా ఉండి తమ హక్కులను సాధించుకోవాలని మాజీ జెడ్పీటీసీ పెన్సంగి ఈశ్వరరావు అన్నారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవాన్ని గురువారం కోరంగిలో ఘనంగా నిర్వహించారు. స్థానిక సీతారామపురంలోని కాలభైరవస్వామి ఆలయం వద్ద మత్స్యకార నాయకుడు వాడ్రేవు వీరబాబు అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమానికి ఈశ్వరరావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. మాజీ ముఖ్యమంత్రి దివంగత ఎన్టీఆర్ మత్స్యకారులకు ఎన్నో పదవులను కేటాయించి, రాజకీయ ప్రాధాన్యం కల్పించారన్నారు. మత్స్యకార యువత బాగా చదువుకుని ప్రయోజకులు కావాలన్నారు. మత్స్యకార గ్రామాల్లో తాగునీటి సమస్య అధికంగా ఉందని, దాని నివారణకు సీతారామపురం గ్రామంలో నిరుపయోగంగా ఉన్న చెరువును వాడుకలోకి తెచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో మత్స్యకార నాయకులు కామాడి మాతరాజు, సంగాడి కామేశ్వరరావు, వైదాడి నూకరాజు, మల్లాడి వరదరాజు, లంకే నూకరాజు, కోలా కొండబాబు, కొపనాతి దత్తాత్రేయవర్మ, పెస్సింగి నాగబాబు, అంగాడి తాతారావు, సంగాడి అన్నవరం, సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

విలువిద్య శిక్షణ శిబిరం ప్రారంభం



శిబిరాన్ని ప్రారంభిస్తున్న వేణుగోపాలరావు

అమలాపురం టౌన్: సర్ సీవీ రామన్ స్కూలులో విలు విద్య శిక్షణా శిబిరం గురువారం ప్రారంభమైంది. ఈ శిబిరాన్ని ఆ స్కూలు డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు ప్రారంభించారు. కోనసీమ వ్యాప్తంగా ఆర్చరీ విద్యపై ఆసక్తి ఉన్న విద్యార్థులకు ఈ శిబిరం ద్వారా విలు విద్య శిక్షకుడు జొన్నలగడ్డ గోపాలకృష్ణ శిక్షణ ఇవ్వనున్నారు. స్కూలు ప్రిన్సిపాల్ గౌసియా బేగం అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభలో వేణుగోపాలరావు మాట్లాడుతూ, కోనసీమలో విలు విద్యను అభివృద్ధి చేయాలన్న అభిలాషతో తాను రూ.80 వేలు వెచ్చించి క్రీడా సామగ్రిని సమకూర్చామని చెప్పారు. విలు విద్య శిక్షకుడు గోపాలకృష్ణ మాట్లాడుతూ, ఇప్పటి వరకూ రాజోలు పరిసర ప్రాంతాల్లోనే విలు విద్య నేర్పించే పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ఇప్పుడు అమలాపురంలో కూడా శిబిరం ఏర్పాటైందని చెప్పారు. వ్యాయామ ఉపాధ్యాయుడు కుడుపూడి బుజ్జి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎవరూ మాదక ద్రవ్యాల జోలికి వెళ్లవద్దు



ర్యాలీ నిర్వహిస్తున్న ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ తదితరులు

అమలాపురం టౌన్: మనిషిని ఆర్యోగపరంగా, మానసికంగా దెబ్బతీసే మాదక ద్రవ్యాల జోలికి పోకుండా, మంచి జీవితాన్ని ఆస్వాదిస్తూ గడపాలని అమలాపురం ఎక్సైజ్ సీఐ వీటీవీవీ సత్యనారాయణ హితవు పలికారు. అంబాజీపేట మండలం గంగలకుర్తి అగ్రహారంలో గ్రామస్తులతో కలసి మాదక ద్రవ్యాల నియంత్రణపై గురువారం రాత్రి జరిగిన అవగాహన ర్యాలీని సీఐ సత్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా సీఐ సత్యనారాయణ మాట్లాడుతూ, 2010లో ఇదే గ్రామంలో నాటు సారా వల్ల 18 మంది మృత్యువాత పడ్డారని గుర్తు చేశారు. ఆ చేదు అనుభవాలు, చేదు జ్ఞాపకాలకు ఎంత మాత్రం తావు లేకుండా, గ్రామ ప్రజలు మాదక ద్రవ్యాల నియంత్రణ పరంగా ఎప్పుడూ సురక్షితంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు. గ్రామంలో మద్యం, నాటుసారా, గంజాయి వంటి దురలవాట్లకు గ్రామం పూర్తిగా దూరంగా ఉండి, ఆదర్శంగా ఉండాలని సూచించారు. మాదక ద్రవ్యాలను అలవాటుగా మార్చుకుంటే వర్తమానమే కాకుండా, భవిష్యత్తు ఎంత భయంకరంగా ఉంటుందో ఎక్సైజ్ ఎస్సై పి.బాలాజీ వివరించారు. గ్రామ పెద్దలతో కలసి గ్రామమంతా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎక్సైజ్ హెచ్‌సీ నాగేశ్వరరావు, కానిస్టేబుల్ దేవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా వ్యతిరేక విధానాలపై 26న ఆందోళన

యానాం: కేంద్రంలో ప్రధాని మోదీ ప్రభుత్వ పదేళ్ల ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 26న జరిగే దేశవ్యాప్త ఆందోళనలను విజయవంతం చేయాలని వివిధ ప్రజా సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. గురువారం స్థానిక సీఐటీయూ అధ్యక్షుడు జి.దుర్గాప్రసాద్ అధ్యక్షతన ప్రజా సంఘాల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా సంయుక్త కిసాన్ మోర్చా పిలుపుమేరకు ఆరోజు జరిగే దేశవ్యాప్త ఆందోళనలను విజయవంతం చేయాలని కరపత్రాన్ని విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ, మోదీ ప్రభుత్వ పదేళ్ల కాలంలో రైతుల ఆత్మహత్యలు రెట్టింపయ్యాయని, ఉపాధి దొరక్క అసంఘటిత కార్మిక రంగంలో సైతం ఆత్మహత్యలు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. పారిశ్రామిక సంస్థల్లో కార్మికులు బానిసలకంటే దారుణమైన పరిస్థితుల్లో ఉన్నారన్నారు. యువతలో నిరుద్యోగం పెరిగిపోయిందని పేర్కొన్నారు. కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, 4 లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో నాయకులు పంపన మధు, శీలం దుర్గాప్రసాద్, చలం, శ్రీనివాసరావు, వెంకన్నబాబు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

అమలాపురం రూరల్: అమలాపురం మండలం ఈదరపల్లిలోని సబ్ స్టేషన్‌లో 8 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ మోకా రవికుమార్ తెలిపారు. ఈ సందర్భంగా అమలాపురం పట్టణ, రూరల్‌లోని పలు గ్రామాల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు. ఆర్టీసీ బస్టాండ్, నారాయణపేట, కె.అగ్రహారం, హైస్కూల్ రోడ్, సూర్యనగర్, వడ్డిగూడెం, కాలేజీ రోడ్, తారకరామానగర్, సుబ్బరాజువీధి, కంసాల కాలనీ ప్రాంతాల్లో, రూరల్ మండలంలో ఈదరపల్లి, ఇందుపల్లి, సాకుర్రు, నడిపూడి, బండారులంక గ్రామాల్లో అంతరాయం కలుగుతుందని వివరించారు.

వార్షిక మరమ్మతుల కోసం..

అల్లవరం: దేవగుప్తం సబ్ స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాల్లో శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ రవికుమార్ గురువారం తెలిపారు. వార్షిక మరమ్మతుల్లో భాగంగా ఈ అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించాలి

- ఆకట్టుకున్న రీజినల్ స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన
- విద్యార్థుల 190 ఎగ్జిబిట్స్ ప్రదర్శన



సైన్స్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తున్న మునిస్వామి



పర్యావరణానికి హాని లేని ప్లాస్టిక్ వస్తువుల తయారీని వివరిస్తున్న విద్యార్థులు

యానాం: ప్రతి విద్యార్థిలో అంతర్లీనంగా ఉన్న సృజనాత్మకతను వెలికితీసేలా వైజ్ఞానిక ప్రదర్శనలు ఉపకరిస్తాయని, భావి శాస్త్రవేత్తలుగా తయారయ్యేందుకు మార్గదర్శకంగా ఉంటాయని రీజినల్ అడ్మినిస్ట్రేటర్ మునిస్వామి అన్నారు. గురువారం స్థానిక రాజీవ్‌గాంధీ ప్రభుత్వ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో పుదుచ్చేరి విద్యా శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మూడు రోజుల రీజినల్ సైన్స్ ఎగ్జిబిషన్ 2024–25ను ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తరగతి గదుల్లోనే దేశ భవిష్యత్తు తీర్చబడుతుందన్నారు. ఇందుకు ఉపాధ్యాయులు కీలకపాత్ర వహిస్తారని, చిన్నారులను ఉన్నతవంతులుగా తీర్చేది వారేనన్నారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎగ్జిబిట్లు

నియోజకవర్గ పరిధిలో వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ స్కూళ్లు, జూనియర్ కళాశాలల విద్యార్థులు తయారుచేసిన 190 ఎగ్జిబిట్లను సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రదర్శించారు. ముఖ్యంగా భీమ్‌నగర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థి పవన్ తయారుచేసిన స్మార్ట్ ఫోన్ ఎడిక్షన్, సీతారామనగర్ స్కూల్ విద్యార్థి మెల్లం అక్షయ్ తయారుచేసిన సేవ్ ఎర్త్, కురసాంపేట ప్రాథమిక పాఠశాల విద్యార్థిని డి.మోక్షిత చేసిన వేస్ట్ వాటర్ ప్యూరిఫికేషన్, రీజెన్సీ స్కూల్ విద్యార్థి టి.కార్తికేయ చేసిన స్పేస్ షటిల్ నాసా(రాకెట్ అండ్ ల్యాండ్‌రోవర్), గౌతమ్ రాజ్ చేసిన ఆటోమేటిక్ ఫ్లెషింగ్ టాయ్‌లెట్, హర్షిత చేసిన సీలింగ్ సన్‌లైట్ ఎట్ నైట్, అజయ్ చేసిన స్మార్ట్ పెట్ ఫీడర్ తదితర ఎగ్జిబిట్లు అందరినీ ఆలోచింపజేశాయి. ఈ కార్యక్రమంలో విద్యాశాఖాధికారి పంపన లక్ష్మణ్‌ప్రవీణ్, ఎస్ఎస్ఏ ఏడీపీసీ కమిడి ప్రభాకర్, ప్రిన్సిపాల్ రత్నప్రభ, వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



స్పేస్‌షటిల్ రాకెట్, ల్యాండ్‌రోవర్



సీలింగ్ సన్‌లైట్ ఎట్ నైట్



స్మార్ట్ పెట్ ఫీడర్



స్మార్ట్‌ఫోన్ ఎడిక్షన్ వల్ల నష్టాలను తెలిపే ఎగ్జిబిట్

మహిళా రక్షణకు ప్రత్యేక చట్టాలు

అల్లవరం: రాజ్యాంగం మహిళల రక్షణకు అనేక చట్టాలు కల్పించిందని ఎస్సై హరీష్‌కుమార్ అన్నారు. గురువారం ఓడలరేవు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా సంరక్షణపై బాలికలకు అవగాహన కల్పించారు. కార్యక్రమానికి హెచ్ఎం కేఎస్ఆర్ మూర్తి అధ్యక్షత వహించారు. ఎస్సై మాట్లాడుతూ, మహిళలు, బాలికల రక్షణ కోసం ప్రత్యేక చట్టాలు ఉన్నాయన్నారు. పని ప్రదేశంలో అధికారులు, అపరిచిత వ్యక్తులతో జాగ్రతగా ఉండాలని సూచించారు. గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై ప్రతి అమ్మాయి తెలుసుకోవాలన్నారు. ఎవరైనా అమర్యాదగా ప్రవర్తిస్తున్నారని అనుమానం వస్తే వెంటనే తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మల్లాడి మంగాయమ్మ, మల్లాడి ఉమామహేశ్వరరావు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

ఓఎన్‌జీసీ పరిహారంపై సమావేశం

యానాం: నియోజకవర్గ పరిధిలోని మత్స్యకారులకు చెల్లించాల్సిన ఓఎన్‌జీసీ నష్ట పరిహారంపై చర్చించడానికి గురువారం సీఎం రంగసామి నేతృత్వంలో ఉన్నత స్థాయి సమావేశం జరిగిందని గురువారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు తెలిపారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆర్థిక, మత్స్య శాఖ కార్యదర్శులు, పలువురు డైరెక్టర్లు పాల్గొన్నారని చెప్పారు. అర్హులైన లబ్ధిదారుల జాబితా ప్రకారం 5,520 మందికి పరిహారం జమ చేసేలా నిర్ణయం తీసుకున్నారని, దీనికి సంబంధించి ఫైలును సిద్ధం చేయాలని సీఎం రంగసామి ఆదేశించారన్నారు. ఓఎన్‌జీసీ పరిహారానికి సంబంధించి సొమ్మును ప్రభుత్వ ఖాతాలో జమ చేసినటప్పటికీ, సాంకేతికపరమైన కారణాలతో లబ్ధిదారుల ఖాతాలో చేరలేదు. ఈ సమస్యను ఈ నెల చివరి వారంలోగా పరిష్కరించే విధంగా కృషి చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

బండారులంకలో మహా పుష్పయాగం

అమలాపురం రూరల్: మండలంలోని పాత బండారులంకలో ఉన్న భువనేశ్వరి సమేత త్రయంబకేశ్వర స్వామి ఆలయంలో శివపార్వతుల దివ్య కల్యాణ మహోత్సవాల సందర్భంగా గురువారం 11 రకాల పరిమళ పుష్పాలతో మహా పుష్పయాగం నిర్వహించారు. శ్రీశైలం మాజీ ట్రస్టీ చింతా శంకరమూర్తి, చంద్రకళ దంపతులు కర్తలుగా, సద్గురువు సత్యనారాయణ బ్రహ్మత్వంలో కార్యక్రమం ఘనంగా జరిగింది. ముత్తైదువులు స్వీట్లు, పూలు, పండ్లను స్వామివారికి సమర్పించారు. భక్తులకు ప్రసాద వితరణ జరిగింది.

540 లీటర్ల అక్రమ డీజిల్ పట్టివేత




పోలీసులు స్వాధీనం చేసుకున్న సరకు, ఆటో

తాళ్లరేవు: కేంద్ర పాలిత ప్రాంతమైన యానాం నుంచి ఆంధ్రా ప్రాంతానికి అక్రమంగా తరలిస్తున్న 540 లీటర్ల డీజిల్‌ను గురువారం కోరంగి పోలీసులు పట్టుకున్నారు. కోరంగి ఎస్సై పి.సత్యనారాయణ తెలిపిన వివరాల మేరకు, సుంకరపాలెంలో నిర్వహించిన తనిఖీలలో యానాం నుంచి ద్రాక్షారామ వైపు వెళుతున్న ఆటోలో 540 లీటర్ల డీజిల్‌ను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించామన్నారు. ఉండూరు గ్రామానికి చెందిన అందే చక్రధర్ అనే వ్యక్తి ఆటోలో తరలిస్తున్న నేపథ్యంలో, డీజిల్‌తో పాటు ఆటోను సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. అనంతరం వాటిని కరప డీటీ అనిల్‌కు అప్పగించగా, నిందితునిపై 6ఏ కేసు నమోదు చేశారన్నారు. తాళ్లరేవు వీఆర్వో పోలవరపు వీరబాబు, కోరంగి వీఆర్వోలు నక్కా శ్రీనివాస్, వాడపర్తి సుబ్రహ్మణ్యం ఉన్నారు.

బెల్ట్ షాపు నిర్వాహకుడి బైండోవర్

అమలాపురం టౌన్: అల్లవరం మండలం మొగళ్లమూరులో బెల్ట్ షాపు నిర్వహిస్తున్న కె.గణ వెంకటేశ్వరరావును బైండోవర్ చేసినట్లు అమలాపురం ఎక్సైజ్ సీఐ వీటీవీవీ సత్యనారాయణ తెలిపారు. నిందితుడిని అల్లవరం మండల ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్, తహసీల్దార్ ఎదుట హాజరుపర్చగా, అతడికి రూ.లక్ష ష్యూరిటీ విధించినట్లు సీఐ చెప్పారు. 128, 129 బీఎన్ఎస్ఎస్ యాక్ట్ ప్రకారం నిందితుడిని ఎక్సైజ్ ఎస్సై పి.బాలాజీ బైండోవర్ చేశారని సీఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్ర గాయాలు



తీవ్రంగా గాయపడిన మదనేశ్వరరావు

తాళ్లరేవు: యానాం–కాకినాడ జాతీయ రహదారిలో జారిర్జిపేట జంక్షన్ పోలేకుర్రు వై.జంక్షన్ వద్ద గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. కోరంగి పోలీసుల వివరాల మేరకు, అమలాపురం మండలం జనిపల్లికి గ్రామానికి చెందిన కుడిపూడి మదనేశ్వరరావు ద్విచక్ర వాహనంపై కాకినాడ వైపు వెళుతూ.. వై.జంక్షన్ వద్దనున్న బారికేడ్‌ను ఢీకొని పడిపోయాడు. అదే సమయంలో అమలాపురం నుంచి కాకినాడ వెళుతున్న ఆర్టీసీ బస్సు అతడి రెండు కాళ్ల పైనుంచి వెళ్లడంతో, అవి నుజ్జయ్యాయి. ప్రాథమిక చికిత్స అనంతరం అతడిని తాళ్లరేవు సీహెచ్‌సీకి, మెరుగైన చికిత్స కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. ఎస్సై సత్యనారాయణ కేసు దర్యాప్తు చేస్తున్నారు.